క్లుప్తంగా

ఘనంగా మాస శివరాత్రి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు ఉమా రామలింగేశ్వర ఆలయంలో బుధవారం మాస శివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఉమా రామలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సహకారంతో నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని, అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రు నాయక్, ఎల్లేటి శ్రీనివాసరావు, కనకరెడ్డి, శ్రీనివాస్, నాగభూషణం, శంకరరావు, ఉప్పిలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



లోకేష్, రాజేశ్వరి

పెదగంట్యాడ: అండర్-19 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో మండలంలోని ఇస్లాం పేట జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు సత్తా చాటారు. అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో విశాఖ జిల్లా నుంచి లోకేష్, రాజేశ్వరి ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న పోటీలకు ఎంపికయ్యారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్ బెన్నుస్వామి తదితరులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు.

పేదలకు దుస్తుల వితరణ



పేదలకు దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ నాయకుడు గొందేశి సన్యాసిరావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా సన్యాసిరావు చిత్రపటానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే చేతులమీదుగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కొయ్య భారతి, అప్పలరెడ్డి, ధర్మాల శ్రీను, మహేశ్వరరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీసీఈబీ సభ్యుడిగా భాస్కరరావు



భాస్కరరావును సత్కరిస్తున్న జిప్సా, అప్సా ప్రతినిధులు

గాజువాక: విశాఖ జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం బోర్డు (డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్- డీసీఈబీ) సభ్యుడిగా గాజువాక ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) అధ్యక్షుడు పొలవలస భాస్కరరావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ నుంచి ఆయన బుధవారం ఉత్తర్వులను స్వీకరించారు. జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ, పరీక్షల ఫీజు, ప్రశ్నాపత్రాల ముద్రణ తదితర అంశాలపై ఆమెతో చర్చించారు. భాస్కరరావును డీఈవో చంద్రకళ, ఆర్జేడీ జ్యోతికుమారితో పాటు జిప్సా, అప్సా సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు సోమశేఖర్, శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, మురళీ సుందర్, రమేష్ నాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు దారేది?

అనధికార వాహనాల పార్కింగ్‌తో వాహనచోదకుల అవస్థలు



రోడ్డుకు ఇరువైపులా పార్క్ చేసిన వాహనాలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు రాంనగర్‌లోని పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ ఏ బ్లాక్‌లో అనధికార వాహనాల పార్కింగ్‌తో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలోని గొడౌన్లకు పలు రాష్ట్రాల నుంచి వివిధ రకాల ఉత్పత్తులు నిల్వ చేయడానికి భారీ వాహనాలు వస్తుంటాయి. ఈ వాహనాలు రోజుల తరబడి రోడ్డు పైనే పార్క్ చేసి ఉండడంతో ఈ మార్గంలో నిత్యం ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఈ రోడ్డు రాంనగర్ నుంచి మింది గ్రామానికి దగ్గర మార్గంగా ఉంది. దీంతో స్థానికులు ఎక్కువగా ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. వారు ఈ వాహనాలతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. భారీ వాహనాలు నిలిపి ఉంచడంతో మహిళలు, పిల్లలను ఒంటరిగా ఈ మార్గంలో పంపించలేని పరిస్థితి ఉంది. వీటితో పాటు రాంనగర్ మింది చెరువు పక్కన నూతనంగా డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించారు. ఇది ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఆ ఆరోగ్య కేంద్రానికి కూడా ఈ రోడ్డే ప్రధాన మార్గం. వీటిని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు స్పందించాలని, వాహనాలు రోడ్డుపై నిలపకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్



మాట్లాడుతున్న ఎంవీఐ బుచ్చిరాజు

అగనంపూడి: వాహనచోదకులు రోడ్డు నియమాలు పాటిస్తే ప్రమాదాలను చాలావరకు కట్టడి చేయవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు అన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మితిమీరిన వేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం నేరమని తెలిపారు. ద్విచక్రవాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలకు అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ సుందర్ రామమ్, డీన్ బి.సతీష్, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న ఆరోగ్య సురక్ష’పై అవగాహన



సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న పాండురంగ కిరణ్

పెదగంట్యాడ: వైద్య ఆరోగ్యశాఖలో అమలు చేయనున్న సరికొత్త పథకం జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించిన కార్యాచరణ రూపొందించేందుకు సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పెదగంట్యాడ 1,2,3 సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో వార్డు ప్రత్యేక అధికారి పాండురంగ కిరణ్ బుధవారం సమావేశమయ్యారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఇంటింటా ప్రజల ఆరోగ్యంపై సర్వే చేసి వైద్య సేవలందించేలా చేపట్టాల్సిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

వెంకన్న సన్నిధిలో వారణాసి స్వామీజీ



స్వామీజీకి ఆలయ విశిష్టతను వివరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని వారణాసి నుంచి వచ్చిన బ్రహ్మర్షి సునీల్ చైతన్య మహరాజ్ తన శిష్య బృందంతో బుధవారం సందర్శించారు. స్వామిజీకి ఆలయ కమిటీ ప్రతినిధులు మంత్రి మంజుల, దొడ్డి రమణతో పాటు 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ వేంకటేశ్వర స్వామి ఆలయం ఎక్కడ ఉంటే ఆ ప్రాంతంలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. ఆలయ పరిసరాలను పరిశీలించి.. నిర్మాణం, విగ్రహాల ఏర్పాటు, వాస్తుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

75వ వార్డులో అన్న సమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు మొల్లివానిపాలెంలో మురళీకృష్ణ యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం అన్న సమారాధన నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకల ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించి, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, అయోధ్యరామ్, కురందాస్ వంశీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూపై అప్రమత్తత అవసరం



డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్న ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్

పెదగంట్యాడ: డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలని ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. జీవీఎంసీ 64వ వార్డు కొత్తదిబ్బపాలెంలో బుధవారం డెంగ్యూపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇళ్లలో నీటి నిల్వలు ఉంటే దోమలు వృద్ధి చెంది వ్యాధులను వ్యాప్తి చేస్తాయన్నారు. వారంలో రెండు రోజులు డ్రై డే పాటించాలని, తద్వారా వ్యాధులను అరికట్టవచ్చని చెప్పారు. ఇల్లు, పరిసరాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రోడ్లపై, కాలువల్లో చెత్త వేయవద్దని, రోజూ ఇళ్ల వద్దకు వచ్చే శానిటరీ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దని.. గుడ్డ, నార సంచులనే మాత్రమే వాడాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

15, 16 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-6లోని 68వ వార్డు పరిధిలో ఈ నెల 15, 16 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు ఎస్. శేఖర్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. మింది నీటి శుద్ధి కేంద్రం 4.50 ఎంజీడీ ప్లాంట్ పైప్‌లైన్ ఫిల్టర్ చాంబర్‌కు అనుసంధానం చేయడం జరుగుతుందని తెలిపారు. దీంతో 15, 16 తేదీల్లో బీహెచ్ఈఎల్, విశాఖ డెయిరీ, ఐఎన్ఎస్ ఏకశిల, విశాఖ వైర్ రోప్స్ మింది, రాంనగర్, కాశికనగర్, అప్పన్నకాలనీ, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

జీవరాశుల మనుగడకు వృక్షాలు ఆధారం



ప్రసంగిస్తున్న ఆచార్య సాల్మన్‌రాజు

ఏయూ క్యాంపస్: జీవరాశుల మనుగడకు వృక్షాలు ఆధారంగా నిలుస్తాయని ఏయూ పర్యావరణ శాస్త్ర విభాగ ఆచార్యుడు జి.సాల్మన్‌రాజు తెలిపారు. ఏయూ హెచ్ఆర్‌డీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న పర్యావరణ శాస్త్ర పునశ్చరణ తరగతుల్లో అధ్యాపకులనుద్దేశించి ఆయన ప్రత్యేక ప్రసంగం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న అడువులు, వృక్ష వైవిధ్యం, పుష్పాలు, వృక్షాలతో ఇతర జీవులకు ఉన్న అనుబంధం కళ్లకు కట్టినట్లు వివరించారు. కీటకాలు, పక్షులకు వృక్షాలు ఆధారంగా నిలుస్తున్న విధానాన్ని ఫొటోలతో సహా అవగాహన కల్పించారు. కలుపు మొక్కల నుంచి వచ్చే పువ్వులు సైతం సీతాకోక చిలుకలు, తేనెటీగలు, పక్షులకు ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని వివరించారు. ప్రధానంగా వేసవిలో అనేక పక్షులు, జీవులకు ప్రాణాధారంగా వృక్షాలు నిలుస్తున్న విధానాన్ని తెలియజేశారు. శేషాచలం అడవుల్లో దర్శనమిచ్చే వివిధ ఔషధ, సుగంధ వృక్షాల ప్రత్యేకతలను వివరించారు. తూర్పు, పశ్చిమ కనుమల్లో ఉండే వృక్ష వైవిధ్యం, గిరిజన ప్రాంతాలలో ఉండే చెట్లు, పుష్పాల విశిష్టతను తెలియజేశారు. పలు పుష్పాలు పురుగులను ఆకర్షించి తిగిరి వెళ్లనివ్వకుండా మరణించేలా చేస్తాయని, వీటిని కిల్లర్ ఫ్లవర్‌గా పిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రం సంచాలకులు ఆచార్య టి.వెంకటకృష్ణ, ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిత్య కల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేష వస్త్రాలు అందజేశారు.

సర్వహిత పింఛన్ల అందజేత



పింఛన్లు అందిస్తున్న రిటైర్డ్ హెచ్ఎం అప్పారావు మాస్టారు

అగనంపూడి: అర్హులైన 75 మంది నిరుపేదలకు పింఛన్‌తో పాటు నిత్యావసర సరకులు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరుపమానమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రిటైర్డ్ హెచ్ఎం బొండా అప్పారావు మాస్టారు అన్నారు. లబ్ధిదారులకు బుధవారం పింఛన్లు అందించారు. నిరుపేద కుటుంబానికి నెలకు సరిపడే బియ్యం, పప్పులు, నూనె, ఇతర వంట సామగ్రి అందజేశారు. ఇటీవల మరణించిన పింఛన్‌దారు అట్టా సన్యాసమ్మ దహన సంస్కారాల నిమిత్తం రూ.2వేల నగదు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుడే సుశీలా గజేంద్రరావు, సలహాదారు పట్టా రామ అప్పారావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సమాచారం

‘ఆక్సిజన్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే సహించం’



స్టీల్‌ప్లాంట్ వర్క్స్ సీజీఎం స్వామితో చర్చిస్తున్న గుర్తింపు యూనియన్ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఆక్సిజన్ ప్లాంట్-2ను ప్రైవేటీకరించాలని చూస్తే సహించబోమని గుర్తింపు యూనియన్ ఏఐటీయూసీ నాయకులు స్పష్టం చేశారు. సీజీఎం (వర్క్స్) ఎస్.వి.స్వామిని బుధవారం కలిసి, ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై సీజీఎం మాట్లాడుతూ ఆక్సిజన్ ప్లాంట్-2ను ప్రైవేటీకరించే ప్రతిపాదన యాజమాన్యం వద్ద లేదని చెప్పారు. కొత్త నియామకాలు లేనందున కోక్‌ఓవెన్స్ విభాగంలో ప్రస్తుతం ఉన్న ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం), సింటర్ ప్లాంట్, ఆర్ఎంహెచ్‌పీ విభాగాల్లో ఉన్న టోటల్ మెయింటెనెన్స్ కాంట్రాక్ట్ (టీఎంసీ) వలే ఇది కూడా ఉక్కు యాజమాన్యం ఆధ్వర్యంలో ఓ అండ్ ఎం గా నడుస్తుందన్నారు.

త్వరలో బీఎఫ్-3 పునఃప్రారంభం

ప్రస్తుతం కోకింగ్ కోల్ సరిపడా ఉందని, బుధవారం నాలుగు రేక్‌లు ఐరన్‌ఓర్ వచ్చిందని తెలిపారు. ఐరన్ ఓర్ కొరత త్వరలోనే తీరి, బీఎఫ్-3ను పునఃప్రారంభించనున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కె.ఎస్.ఎన్.రావు, జె.రామకృష్ణ, కర్రి బాబూరావు, జ్యోతిప్రసాద్, జయ, దుర్గారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే శిక్ష తప్పదు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి వాణిశ్రీ

దాబాగార్డెన్స్ : విద్యార్థులు స్నేహ భావం కలిగి ఉండాలని, సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేస్తే శిక్ష తప్పదని జిల్లా అదనపు న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు జడ్జి వాణిశ్రీ పేర్కొన్నారు. జిల్లా లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో ర్యాగింగ్ చట్టం 1997పై బుధవారం ఏవీఎన్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వాణిశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం, న్యాయ వ్యవస్థపై గౌరవభావం కలిగి ఉండడం అవసరమన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి ఎంవీ శేషమ్మ మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు పౌర సమాజంలో ఎన్నో మంచి మార్పులు వచ్చేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. విద్యార్థులు యేసయ్య, ఆనంద్, వెంకటరత్నం, గాయత్రీ, వినీత ర్యాగింగ్ చట్టాలు, శిక్షలపై మాట్లాడారు. ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌వీకే ప్రసాద్, ఏఎంసీ ఫిజియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ పీఎస్ఎన్ రాజు, ప్రభుత్వ మానసిక ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ వైఎస్సార్ పెన్షన్ కానుక

లబ్ధిదారులకు కొత్త పింఛన్ల పంపిణీ



86వ వార్డులో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న దామా సుబ్బారావు



74వ వార్డులో మహిళకు పెన్షన్ అందిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ పింఛన్లు అందించేందుకు కృషి చేస్తున్నామని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి తెలిపారు. దయాల్‌నగర్ సచివాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు 49మందికి కొత్త పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో మొత్తం 90 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. పింఛన్ అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే నాగిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. సచివాలయ సిబ్బంది, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

86వ వార్డులో..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి ఫకీర్ టకియా, భరత్‌నగర్-2 సచివాలయాల పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దామా సుబ్బారావు లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రెండు సచివాలయాల పరిధిలో కొత్తగా 22 మందికి వైఎస్సార్ పింఛన్ కానుక మంజూరైందని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ.. ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో చెప్పడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు మహిళా అధ్యక్షురాలు నిర్మల, చేగొండి శ్రీనివాసరావు, కన్వీనర్లు బాలకృష్ణ, శ్రీనివాస్‌పట్నాయక్, సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

‘కార్పొరేట్’కు లాభం చేకూర్చేందుకే ప్రైవేటీకరణ



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న నాయకుడు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుట్రపూరిత ఆలోచనతోనే ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు ఇటువంటి కుట్రలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 944వ రోజు బుధవారం సంస్థకు చెందిన ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కేవలం రూ.10 కోట్ల ఖర్చుతో 1700 టన్నుల ఆక్సిజన్ తయారుచేస్తోందన్నారు. కానీ కేంద్రప్రభుత్వం దుర్మార్గపు ఆలోచనతో ప్రైవేట్‌వారికి రూ. 50 కోట్లు ఖర్చు చేయడానికి అంగీకరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికే విశాఖ స్టీల్ ప్లాంట్ 2700 టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తోందని, మరో 1700 టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తికి అవసరమైన ప్లాంట్‌ను నిర్మించడం జరిగిందని తెలిపారు. కానీ నేడు కేంద్రప్రభుత్వం ప్లాంట్‌ను నడపలేమని చెప్పడం సరికాదన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, ఆయోధ్యరామ్, పరంధామయ్య, ఎస్ఎంఎస్-1 ప్రతినిధులు విడివి పూర్ణచంద్రరావు, రమణమూర్తి, ముత్యాల నాయుడు, గుమ్మడి నరేంద్ర, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కణితి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఆటల పోటీల్లో 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. బుధవారం జరిగిన ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. బాలికల ఖోఖో అండర్-17, 14 విభాగంలో విన్నర్స్‌గా, బాలికల షటిల్ బ్యాడ్మింటన్ సీనియర్ విభాగంలో విన్నర్స్‌గా, బాలికల విభాగంలో జూనియర్స్ కబడ్డీలో రన్నర్స్‌గా విజయం సాధించారు. మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి అన్ని విభాగాల్లో 10 జట్లు పాల్గొన్నాయని పీడీ మహ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. విజేతలైన క్రీడాకారులకు పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయులు కుమారస్వామి, పద్మజ, వేణు, నాగేశ్వరరావు, ప్రసాద్ తదితర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఎంప్లాయీస్ యూనియన్ గుర్తింపుపై హర్షం



స్టీల్ సిటీ డిపోలో స్వీట్లు పంపిణీ చేస్తున్న ఈయూ నాయకులు

ఉక్కునగరం: ఎంప్లాయీస్ యూనియన్‌ను ఆర్టీసీ యాజమాన్యం గుర్తింపు యూనియన్‌గా ప్రకటించడంపై స్టీల్ సిటీ డిపోలో యూనియన్ ప్రతినిధులు బుధవారం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత మెజార్టీ సంఘంగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తిని మన్నించి గుర్తించినందుకు డిపో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ధన్యావాదాలు తెలిపారు. డిపో కార్యదర్శి బి. రాము మాట్లాడుతూ ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారంతో పాటు సంస్థకు మరింత మేలు జరిగేలా పని చేస్తామన్నారు. గుర్తింపు రావడానికి సహకరించిన ఏపీ జాక్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఎం.గోపాలుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.హెచ్.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.